చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట కాలనీలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు నిల్వడంతో స్కూల్ నుంచి వచ్చిన చిన్నారులు ఇండ్లలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవ్వగా, వర్షపు నీరు సాఫీగా వెళ్లే దారిలేక వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బందులు తలెత్తుతున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– కొండాపూర్, సెప్టెంబర్ 6

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

కూకట్‌పల్లి వెంకట్‌రావునగర్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌కు మట్టి వినాయక ప్రతిమను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్/శేరిలింగంపల్లి/అల్లాపూర్/బాలానగర్/దుండిగల్/జీడిమెట్ల, సెప్టెంబర్ 6 : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ వెంకట్‌రావు నగర్ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్ఎంసీ చేపట్టిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ, డీసీలు రమేశ్, కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మట్టి విగ్రహాలను పూజించి చెరువుల్లో నిమజ్జనం చేయాలని కోరారు. ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉన్నారు.

■ కేపీహెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ప్రారంభించారు.

■ బాలాజీనగర్ కాలనీ వార్డు కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు ప్రారంభించారు.

■ శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో పంపిణీ చేశారు. వేడుకలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి సైతం పాండ్ల వద్ద తగు వసతులను కల్పించాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

■ శేరిలింగంపల్లి : మట్టి వినాయకులను పూజిద్దామని పర్యావరణాన్ని కాపాడుదామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో హోలిస్టిక్ హాస్పటల్ సౌజన్యంతో ఉచితంగా మట్టివినాయకుల ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు.

■ అల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. జీహెచ్ఎంసీ ఉచితంగా అందజేస్తున్న మట్టి వినాయకుల ప్రతిమలను శుక్రవారం శ్రీవివేకాందనగర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పంపిణీ చేశారు.

■ బాలానగర్: మట్టి గణపతులను పూజిద్దాం–పర్యావరణాన్ని కాపాడుకుందాం అని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. వినాయక్‌నగర్‌లో ఆయన కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న గణపతులను అందజేశారు.

■ దుండిగల్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలల్లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులతో పాటు స్థానికులకు మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధి,గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, నెహ్రూనగర్‌లోని డివిజన్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ పాల్గొని స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

■ మియాపూర్:వివేకానందనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు, ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, వివేకానందనగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేతలు గొట్టిముక్కల పద్మారావు, రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

జాజుకు బదులు నీలం రంగు..

చందానగర్ సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ అధికారులు ప్రతిమల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా చందానగర్ సర్కిల్ పరిధిలో 6 బేబీ పాండ్లలో 4 చెరువుల పక్కన శాశ్వత పాండ్లు కాగా.. మిగిలిన రెండు తాత్కాలికమైనవి. ఈ సారి బేబీ పాండ్లకు అధికారులు నీలం రంగు వేయిస్తున్నారు. నీటికి అనుగుణమైన నీలం రంగుతో బీబీ పాండ్లు కొత్త అందాన్ని సంతరించుకున్నాయని సర్కిల్ డీసీ మోహన్‌రెడ్డి తెలిపారు.



ఆటంకాలు లేకుండా రోడ్డు విస్తరణ

అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ పనుల వివరాలను తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి. చిత్రంలో ఎమ్మెల్యే గాంధీ,కార్పొరేటర్ మంజుల,జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్ డివిజన్‌లో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

■ చందానగర్-అమీన్‌పూర్ రోడ్డులో పర్యటించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

■ లింగంపల్లి అండర్‌పాస్ పనుల పరిశీలన

■ పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

కొండాపూర్, సెప్టెంబర్ 6: చందానగర్–అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోడ్డు విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు, ఏర్పాటుతోపాటు అవసరమైన చోట్లలో కల్వర్టులను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం లింగంపల్లి అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. కాగా, రూ.4కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కాల్వ పనులు పూర్తయితే బ్రిడ్జి పూర్తిగా మెరుగవుతుందని, వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు సాగుతాయని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. దీంతోపాటుగా గంగారం హనుమాన్ దేవాలయం నుంచి అపర్ణహిల్ పార్కు వరకు లింక్ రోడ్డు పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్‌ను కోరారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని, శానిటేషన్ సైతం మెరుగ్గా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ శిరీష, డీఈ దుర్గ ప్రసాద్, ఏఎంఓహెచ్ రవికుమార్, స్ట్రీట్ లైట్స్ ఈఈ మల్లిఖార్జున్, నాయకులు రఘునాథరెడ్డి, సందీప్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

డివిజన్‌ల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, సెప్టెంబర్ 6: సౌకర్యవంతమైన రహదారులు, పటిష్టమైన డ్రైనేజీ, పుష్కలమైన తాగునీరు వంటి వసతులతో డివిజన్‌లను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఇందుకోసం కాలనీల అవసరాలను తెలుసుకుంటూ ప్రణాళికాబద్ధంగా కల్పనకు ముందుకు సాగుతున్నామన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్ నుంచి దీప్తిశ్రీనగర్, లక్ష్మీవెంకటనగర్ నుంచి మక్తా మహబూబ్‌పేట్ రోడ్డు, శ్రీల గార్డెన్, లక్ష్మీనగర్‌లలో రూ.1.53 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీని మౌలిక సౌకర్యాలతో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, సీఎం రేవంత్‌రెడ్డి తోడ్పాటుతో అధిక నిధులు సమకూర్చుకుని నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలుపుతానన్నారు. ఐటీకి వేదికగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాబోయే రోజులలో మరిన్ని లింక్ రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా విశాలమైన రహదారుల కల్పనే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో వినాయక నిమజ్జనానికి వసతులు

సర్కిల్ పరిధిలో 6 నిమజ్జన పాండ్లు : డీసీ మోహన్‌రెడ్డి

ఖాయిదమ్మకుంట బేబీ పాండ్‌ను పరిశీలిస్తున్న డీసీ

మియాపూర్, సెప్టెంబర్ 6: జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ పరిధిలో వినాయక ఉత్సవాలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రూ.50లక్షల నిధులతో బేబీ పాండ్ల వద్ద అన్ని వసతుల కల్పనను ప్రారంభించినట్లు త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని గంగారం, గురునాథం, ఖాయిదమ్మ కుంట, దీప్తిశ్రీనగర్, పీజేఆర్ స్టేడియంలో బేబీ పాండ్లను ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి డీసీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ వ్యాప్తంగా గంగారం, గుర్నాథం, ఖాయిదమ్మకుంట, కొత్తకుంట చెరువుల వద్ద బేబీ పాండ్లు, పీజేఆర్ స్టేడియంలో తాత్కాలిక పాండు, దీప్తిశ్రీనగర్‌లో ఎక్స్‌కావేషన్ బేబీ పాండును వినాయక ప్రతిమల నిమజ్జనానికి వసతులను సిద్ధం చేస్తున్నామన్నారు. పాండ్లకు ఈసారి నీలిరంగు, భారీ టెంట్‌ల ఏర్పాటు, డీ వాటరింగ్, భారీ కేడింగ్‌ల ఏర్పాటు, అప్రోచ్ రహదారులకు మరమ్మతులతోపాటు ప్రత్యేక నిధులతో వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు, సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పాండ్ల వద్ద 24గంటల పారిశుద్ధ్య పనులను చేపట్టనున్నట్లు డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవి కుమార్, ఈఈ రాజు, డీఈ శిరీష, ఏఈ రెడ్డి పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు తొలగించాలి

హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని గ్రీన్ కోర్ అపార్టుమెంట్ సమీపంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను బకెట్ క్లీనింగ్ యంత్రంతో తొలగించాలని సూచించారు. ఇటీవలి వర్షాలకు పెద్దఎత్తున వ్యర్థాలు సైతం వాటిల్లో చేరడం వల్ల మురుగు నీటి సరఫరాకు ఆటంకం కలిగి రహదారుల పైకి వస్తున్నాయని, వెంటనే పనులను ప్రారంభించాలని కార్పొరేటర్ పేర్కొన్నారు. పాతలైన్ల స్థానంలో కొత్త వాటి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

– మియాపూర్, సెప్టెంబర్ 6

తాగునీరు కలుషితం కాకుండా చూడండి

జలమండలి ఈడీ

పటిష్టమైన తాగునీటి సరఫరాతో పాటు ఎక్కడా కలుషిత నీటి సమస్యల్లేకుండా చూడాలని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ నీటి కలుషితం లాంటివి కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జలమండలి కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ, మహంకాళీనగర్ ప్రాంతాల్లో ఈడీ మయాంక్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సరఫరా అవుతున్న నీటి నాణ్యత, మీటర్ల పనితీరు, జీఐఎస్ సర్వే, సమయాలపై ఆరా తీశారు. మహంకాళీనగర్‌లో నీటిలో క్లోరిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫిల్లింగ్ పాయింట్లను ఈడీ తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి కలుషితం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఈడీ స్పష్టం చేశారు. జీఎం ప్రభాకర్ ఇతర అధికారులున్నారు.

– మియాపూర్, సెప్టెంబర్ 6

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కేపీ

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్6: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు కొంతమేరా దెబ్బతిన్నాయని, ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కుత్బుల్లాపూర్–గాజులరామారం జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్ క్యాంపు కార్యాలయంలో అధికారుల సమీక్ష నిర్వహించి వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుత్బుల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్‌లో బస్తీదవాఖానలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు.

చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, అవార్డులను అందించిన ఎంఈవో హరీశ్‌చంద్ర

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 6: చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్థులను చేయాలని కూకట్‌పల్లి మండల విద్యాధికారి హరీశ్‌చంద్ర అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవో హరీశ్‌చంద్ర.. మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి అవార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనదని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈవేదికపై ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు బి.రాజిరెడ్డి, టి.రవికుమారి, జగదీశ్వర్, ఎ.సుజాత, ఫర్జానాబేగం, ఎండీ సాబేర్ అలీ, పవిత్ర, ఎ.నీరజ, పి.కవితలను ఘనంగా సన్మానించారు. ఏఈవోలు రవీందర్‌రాజు, కిషన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విఠల్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మస్తాన్‌వలీ, ఎస్‌టీయూ అధ్యక్షుడు రవీందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 6 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 21, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 50, కాకరకాయ 32, బీరకాయ 45, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 55, కాలీఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 75, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 50, ఆలుగడ్డ 38, కీరా 28, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ 23, కందగడ్డ 55, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 49, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, గుమ్మడికాయ 19, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నాగార్జుననగర్‌లో ముంపు సమస్యకు చెక్

ఫతేనగర్ డివిజన్ పరిధి నాగార్జుననగర్‌లో ముంపు సమస్యకు చెక్ పెట్టినట్లు డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్‌లో వర్షంతో ముంపు సమస్య తలెత్తుతున్న సందర్భంగా వరదనీటి డ్రైన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వరదనీరు నేరుగా వరదనీటి డ్రైన్ ద్వారా నాలాలోకి చేరుకుంటుందన్నారు. వరదనీటి డ్రైన్‌ల నిర్మాణంతో నాగార్జుననగర్‌లో శాశ్వతంగా ముంపు సమస్యకు చెక్ పడనున్నదని తెలిపారు. ఎండీ నసీర్, సలాఉద్దీన్, భిక్షపతి పాల్గొన్నారు.

– బాలానగర్, సెప్టెంబర్ 6

మరిచిపోయిన బ్యాగ్‌ను అప్పగించిన డ్రైవర్, కండక్టర్

బ్యాగ్‌ను బాధిత విద్యార్థి షఖీల్‌కు అందజేస్తున్న డ్రైవర్, కండక్టర్

బాలానగర్, సెప్టెంబర్ 6: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ ఫార్మా విద్యార్థి తన వెంట ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయి బస్సు దిగిపోయాడు. తర్వాత ఆ విద్యార్థి బస్సులో బ్యాగ్‌ను మరిచిపోయినట్లు గుర్తించి టికెట్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలియపరిచాడు. దీంతో ఆర్టీసీ అధికారులు కూకట్‌పల్లి డిపోకు చెందిన డ్రైవర్, కండక్టర్లకు సమాచారం అందజేశారు. శుక్రవారం కూకట్‌పల్లి డిపోకు చెందిన రూట్ నంబర్ 19కే బస్సు మెహదీపట్నం–కేపీహెచ్‌బీకాలనీకి ప్రయాణిస్తున్నది. ఈ బస్సులో డ్రైవర్‌గా రాజ్‌కుమార్, కండక్టర్‌గా సునీత విధులు నిర్వహిస్తున్నారు. మెహదీపట్నంలో బస్సు ఎక్కిన షఖీల్ అనే ఫార్మా విద్యార్థి ఎస్ఆర్‌నగర్‌లో తన వెంట ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయి బస్సు దిగిపోయాడు. అనంతరం తేరుకొని బస్సు టికెట్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి విషయాన్ని ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించాడు. ఆ అధికారులు 19కే బస్సులో విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్, కండక్టర్‌లకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. వెంటనే వారు బస్సులో పరిశీలించగా.. బ్యాగ్ బస్సులోనే ఉందని, వెంటనే వచ్చి తీసుకోవాల్సిందిగా సూచించారు. షఖీల్ కూకట్‌పల్లి బస్సు డిపోకు చేరుకొని బ్యాగ్‌ను తీసుకొని డ్రైవర్, కండక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్6 : జీడిమెట్ల డివిజన్ ఫాక్స్‌సాగర్ చెరువులో రోడామేస్త్రీనగర్‌కు చెందిన షేక్ షబ్బీర్(35) చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. అతడి మృతదేహం కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో రెండురోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది.దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.